# పొగ

జీవితానికీ పొగకూ సంబంధ ముంది. అంటే, ప్రపంచానికీ పొగకూ సంబంధమున్నట్టే.

జీవితంలో సంబంధమున్న ప్రతీదీ మంచి సాహిత్యంలో ప్రతిబింబించక తప్పదు. అందుచేతే 'పొగ'ను ఎక్కువగా చెడుకు ప్రతీకగా వాడతారు.



"నీడలు" అనే కవితలో మహాకవి శ్రీ శ్రీ "చూడు చూడు నీడలు నీడలు పొగ మేడలు" అంటాడు. 'జగన్నాథుని రథ చక్రాలు' కవితలో 'హాలాహలం పొగ చూరింది కోలాహలం చెలరేగింది' అంటాడు. ఒక రాత్రి అనే గేయంలో 'గగనమంతా నిండి పొగలాగ క్రమ్మి బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టు నన్ను' అంటాడు. కొంపెల్ల జనార్దనరావు కోసం అనే ఎలిజీలో 'రెక్కపట్టి నిలబెట్టిన లోకం..... కలలకు పొగలనూ, కాటుకలనూ కల్పి శపించిందో, శఠించిందో మనల్ని!... మా కళ్లల్లో గంధక జ్వాలలు, గుండెలలో గుగ్గిలను ధూమం వేసి....' అంటాడు. వీటికి భిన్నంగా ఆశా దూతలు కవితతో 'మానవకోటి సామ్రాజ్య దూతలు కళా యజ్ఞాశ్వరులై గాలులై, తరగలై, తావులై, పుష్పాలై, కుంకుమలై, పొగలైసాగిరి' అనీ అంటాడు.

నవకవితలో 'రాబందుల రెక్కల చప్పుడు పొగగొట్టపు ఝూంకార ధ్వని...కావాలోయ్ నవకవనానికి' అంటూ కాదేదీ కవితకనర్హం అని స్పష్టం చేస్తాడు.

జీవితంతో సంబంధముందీ అంటే ప్రపంచంతో సంబంధం ఉందన్నమాటే. కనుక, అది మంచి సాహిత్యంలో ప్రతిబింబించక తప్పదు. కనుక, జగమంతా పొగలు పొగలు....... బతుకంతా సెగలు సెగలు" అనీ ఎవరో ఒకరు అనే ఉంటారు.

ఎవరి గురించి అయినా చెడు విన్నప్పుడు, అది నిజమేనేమో అన్పిస్తే 'నిప్పు లేనిదే పొగరాదు కదా' అంటుంటారు.

తమకు గిట్టని వాళ్లను పొమ్మని నోటితో చెప్పలేక. వాళ్లకు వాళ్లే వెళ్లేలా చేస్తే "పొమ్మని చెప్పలేక పొగపెట్టి పంపారు" అంటారు.

"ఈ పొగతో కళ్లు పోయేలా ఉన్నాయి. కాస్త ఎండు కట్టెలు తెమ్మంటే మళ్లీ పచ్చియే నా మొహాన కొట్టావు" అని పల్లెటూళ్లల్లో ఇప్పటికీ కట్టెల పొయ్యిమీదే వంట చేసే ఇల్లాళ్లు వాపోవడం చూస్తూనే ఉన్నాం.

'పొగ' అనేటప్పటికి 'చుట్టు పొగ, బీడీ పొగ, సిగరెట్ పొగ' గుర్తుకు రాకమానవు. చుట్ట, బీడీ, సిగరెట్లను కాల్చడమనే చాలమంది అంటారు.

కొందరు పొగ తాగడం అంటారు. "పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం" అని సిగరెట్ పెట్టెలపై

ముద్రించినా ఆ అలవాటున్నవాళ్లు కాలుస్తూనే (పొగ తాగుతూనే) ఉంటారు.

సిగరెట్లను కొందరు సరదాగా పొగరెట్లని అంటారు. అయితే, అది అపురూప మహారచయిత గురజాడకు ఇమిటేషనే. ఆయనే చుట్టను పొగచుట్ట అన్నాడు. అంతే కాదు, ఓ పద్యమూ చెప్పాడు.

“ఖగపతి అమృతము తేగా / భుగభగమని పొంగి చుక్క భూమిని వ్రాలెన్ / పొగచెట్టయి జన్మించెను / పొగ తాగనివాడు దున్నపోతై పుట్టెన్” అన్నాడు.

అడ్డపొగ అని కూడా వుంది. ఎక్కువగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కూలీ నాలీ చేసుకునే ఆడవాళ్లు కాలుస్తున్న చుట్టను తిరగేసి నోట్లో పెట్టుకుంటారు. చుట్ట పొగనూ నిప్పు వేడినీ కూడా అనుభవిస్తారు. దీన్నే అడ్డపొగ అంటారు.

'పొగ' కాకపోయినా మంచు పొగలా కన్పిస్తుంది. ఆ కారణంగానే పొగమంచు అంటాం. చాలా పొగల్లాగే ఈ పొగమంచు కూడా మామిడి పూత వంటి వాటికి చెడు చేస్తుంది. మామిడి పూత ప్రకృతి ఇచ్చే మంచి. పొగమంచు ప్రకృతి చేసే చెడు.

ఇప్పుడు నిజామాబాద్ జిల్లా మాద్నూర్ మండలంలోని ధన్నూరు గ్రామంలో భూమినుంచి పొగలు వస్తున్నాయట. దీన్ని ఆ జిల్లా కలెక్టర్ ధ్రువీకరించాడు. మహారాష్ట్రకు, నిజామాబాద్ జిల్లా సరిహద్దు కావడంతో ఇటీవల అక్కడి భూకంప ప్రభావంతో ఈ పొగలు వ్యాపించి వుంటాయని ఆ గ్రామాన్ని సందర్శించిన రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ అధికారులు, భూగర్భ శాస్త్రజ్ఞులు అభిప్రాయపడ్డారు. ఏమీ భయం లేదని అన్నారు. ఏ భయం లేకుండా ఉండడంకంటే కావలిసిందేముంది.

నేలతల్లి జనానికి పొగ పెట్టకుండా వుండాలని ఆశిద్దాం.

1.11.93

ఆంధ్రభూమి దినపత్రిక